





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 27-5-2025

సంపుటి: 21 సంచిక: 54
పేజీలు: 8 వెల: రూ.1




# అక్రమాలే పునాది.. భద్రతకు సమాధి

- క్వారీల నిర్వహణ లోపభూయిష్టం
- అధికారులకు కాసులు.. కార్మికులకు కష్టాలు
- మెళియాపుట్టి ప్రమాదానికి మసిపూసే యత్నాలు
- అవి ఫలించకపోవడంతో తనిఖీల హడావుడి
- అనుమతుల్లేని క్వారీలను ఏం చేస్తారన్నదే ఆసక్తికరం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


కాసులు దండుకొని కళ్లు మూసుకోవడం.. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం హడావుడి చేసి తర్వాత మళ్లీ మౌనం దాల్చడం గనుల శాఖ అధికారులకు కొత్త కాదు. మెళియాపుట్టి మండలంలో ఇటీవల గ్రానైట్ క్వారీ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన ఘటనలో ఇది మరోసారి రుజువైంది. ఈ ప్రమాదాన్ని పిడుగుపాటు ఘటనగా చిత్రీకరించి మాయ చేయడానికి తొలుత ప్రయత్నాలు జరిగాయి. జిల్లా ఎస్పీ

- మిగతా చివరి పేజీలో


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్‌ఫొటో)

# పోలీసుల ఉడుంపట్టు.. బెట్టింగు బాబుల ఆటకట్టు!


శివారెడ్డి





అభినవ్


ధనుంజయ

**'చిన చేపను పెదచేప.. చిన మాయను పెనుమాయ మింగేస్తుంది' అని వేదాంతంలో చెప్పినట్టు నగరంలో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లను పరిచయం చేసిన వారే ఇప్పుడు పోటీ పెరిగి ఒకరినొకరు మింగేసుకునే పరిస్థితికి రావడం శుభపరిణామం. అయితే పోలీసులు క్లైమాక్స్‌లో ఎవర్ని 'యూ ఆర్ అండర్ అరెస్ట్' అని అంటారో.. ఎవర్ని తప్పిస్తారో తేలేవరకు నగరంలో బెట్టింగ్ మాఫియా వెన్నులో మాత్రం వణుకు పుడుతోంది. తీగ లాగితే డొంకంతా కదలడం వల్ల మూలన దాక్కున్న బుకీలు కూడా ఇప్పుడు సీసీఎస్ స్టేషన్ దగ్గర చేతులు కట్టుకుని నిల్చుంటున్నారు. కేవలం ఎనిమిది మంది వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని అటు మీడియా, ఇటు పోలీసులు భావిస్తూవచ్చారు. పోలీసులతో ఇన్నాళ్లూ సంబంధాలు నెరిపింది కూడా ఈ ఎనిమిది మంది టీమే. కానీ కేవలం ఇద్దర్ని అదుపులోకి తీసుకుంటే మొత్తం రాష్ట్రవ్యాప్తంగా కూసాలు కదలడం ఈ కథలో కొసమెరుపు.**

- ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన లీల
- విచారణలో విస్తుగొలిపే వివరాలు వెల్లడి
- పేలనున్న బెట్టింగ్ బా(o)బులు!
- లాబీయింగ్ ద్వారా బయటపడేందుకు కొందరి యత్నాలు
- మొత్తం సిండికేట్‌ను చిత్తు చేసేందుకు ఎస్పీ చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంతవరకు క్లబ్ సంతు (న్యూ కాలనీ), దేవి (మహాలక్ష్మీనగర్ కాలనీ), శ్రీకూర్మం శ్రీను (శ్రీకూర్మం), శేఖర్ (డీఎస్పీ ఆఫీస్ ఎదురు), లాలా, ఆటో నాగరాజు (ఇలిసిపురం), పాకాల కిశోర్ (పొన్నాడ), ధనుంజయ (ఒప్పంగి) వీరు మాత్రమే సిండికేట్‌గా ఏర్పడి బెట్టింగులు ఆడిస్తున్నారని పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో

- మిగతా చివరి పేజీలో



# ఇంకా వందరోజులు కాలేదా.. గోవిందా!

- హామీని విస్మరించిన పాతపట్నం ఎమ్మెల్యే
- నరకకూపంగా మారిన సిరసువాడ-కుంటిభద్ర రోడ్డు



**ఈ ఫొటోలు చూశారా.. ఒకటి పొలంబాట కంటే అధ్వానంగా ఉంటే.. ఇంకొకటి చెరువును తలపిస్తోంది. మరొకటి బురదగుంటను మరిపిస్తోంది. వీటిని చూస్తే.. 'ఏ రోడ్డును చూసినా ఏమున్నది గర్వకారణం.. గతకుల కష్టాలు తప్ప' అన్నట్లు కునారిల్లుతున్నాయి. కొత్తూరు మండలంలో సిరుసువాడ, కుంటిభద్ర గ్రామాలకు వెళ్లే రోడ్డు దీనికి మినహాయింపు కాదు.**

(సత్యంన్యూస్, కొత్తూరు)

రోడ్డు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడం.. శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేయడం తప్ప రోడ్డు రూపురేఖలు మాత్రం మారడం లేదు. ప్రజలకు కష్టాల ప్రయాణాలు తప్పడంలేదు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ఎమ్మెల్యే కలమట రమణ ఒకసారి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. కాగా తనను గెలిపిస్తే వంద రోజుల్లోనే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు సార్వత్రిక ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఆయన గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. అలాగే టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఎమ్మెల్యే అయిన తర్వాత ఈ రోడ్డు నిర్మాణానికి మరోసారి గోవిందరావు శంకుస్థాపన రాయి వేశారు. కానీ వంద రోజులు కాదు.. ఏడాది గడిచినా ఈ రోడ్డు మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వం ప్రజల కనీస సౌకర్యమైన రోడ్లను కూడా మరమ్మతులు చేయలేకపోయిందన్న విమర్శలు రేగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ భాగస్వాములైన తెలుగుదేశం, జనసేనలు రోడ్ల దుస్థితినే హైలైట్ చేస్తూ ఆందోళనలు చేశాయి. అవే వైకాపా ఓటమికి కారణమయ్యాయి. తీరా అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే గానీ కూటమి ప్రభుత్వం గానీ రోడ్ల బాగోగులను పట్టించుకోవడంలేదు. కొత్తూరుతో పాటు నివగాం, మదనాపురం, శిరుసువాడ తదితర గ్రామాల్లోనూ రోడ్ల దుస్థితి ఇలాగే ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





# ఆకట్టుకున్న మహాశిబిరం

- డచ్ బిల్డింగ్‌లో యోగా ధ్యానం
- వెయ్యిమందితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన యోగా శిబిరం
- పది బ్లాకులు.. బ్లాకుకో నిపుణుడు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర-2025' కింద జిల్లాలో మొదటి యోగా శిబిరం సోమవారం ఉదయం చారిత్రక డచ్ బిల్డింగ్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. వెయ్యిమంది పాల్గొన్న ఈ మహా శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- మిగతా చివరి పేజీలో






# పనితీరు మెరుగుపరిచే దిశగా బదిలీలు

(సత్యంన్యూస్, అమరావతి)

రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన సాధారణ బదిలీ ప్రక్రియను అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు అత్యున్నత వైద్యుల పనితీరు మెరుగుపరిచే దిశగా వినియోగించడానికి వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ దిశగా బదిలీలకు సంబంధించి కొన్ని ప్రత్యేక సడలింపులకు ముఖ్యమంత్రి ఆమోదాన్ని పొందింది. వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు విధులు నిర్వహించడం, ఇందుకు సంబంధించిన కొన్ని క్లిష్టమైన అంశాలు, మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రత్యేక అవసరాల నేపథ్యంలో ఈ నెల 15న బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ జారీ చేసిన విధివిధానాల్లో శాఖ అవసరాల మేరకు 10 సడలింపులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదించగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్ని విభాగాధిపతులతో బదిలీలకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ సడలింపుల ప్రతిపాదన చేశారు. క్షేత్రస్థాయిలో రీజనల్ డైరెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌ల కార్యాలయాలతో పాటు ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్ల కార్యాలయాల్లో పలు సంవత్సరాలుగా పనిచేస్తున్న కిందిస్థాయి పాలనా సిబ్బందిపై పలు అవినీతి, అక్రమాల ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని అరికట్టడానికి వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ ప్రధానమైన నిర్ణయాన్ని తీసుకుంది. ఆర్థిక శాఖ విధానాల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న నిబంధనను సడలిస్తూ ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలనా సిబ్బందిని బదిలీ చేయాలని మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ రకమైన చర్య చేపట్టడం ఇదే మొదటిసారి అని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అనుబంధ బోధానాసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ స్పెషాలిటీ ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో కలిపి 37 మంది సీనియర్ డాక్టర్లు, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఏడీఎంఇ) స్థాయిలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. వీరు సమర్థత, సమన్వయాలతో పనిచేస్తూ మంచి ఫలితాల్ని ఇవ్వాల్సి ఉంటుంది. వీరిలో పలువురి పనితీరు ఆశించిన మేరకు లేదు. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల ఐదేళ్ల సర్వీసు పూర్తికానున్నప్పటికీ పనితీరు ఆధారంగా పాలనా అవసరాల మేరకు వారి బదిలీలు జరుగుతాయి.

• ఎడిటోరియల్

## కోటీశ్వరుల పన్నుతో అసమానతలకు చెక్

మనది వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమని గొప్పలు చెప్పుకొంటున్నా.. అదే వేగంతో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. దీనికి ప్రధాన కారణం.. దేశసంపద కేవలం ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల వద్ద పోగుపడిపోవడమేనని తాజాగా విడుదలైన వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక పేర్కొంది. ఈ అసమానతలను తొలగించాలంటే సంపన్నవర్గంపై ఇప్పుడున్న పన్నులను అతి స్వల్పంగా పెంచితే చాలని ఆ నివేదిక సూచించింది. ఆదాయ అసమానతలు తగ్గించడానికి, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రొగ్రెసివ్ వెల్త్ ట్యాక్స్, సమగ్ర పన్ను (కంప్రహెన్సివ్ ట్యాక్స్) విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'ఇన్‌కమ్ అండ్ వెల్త్ ఇనీక్వాలిటీ ఇన్ ఇండియా 1922-2023' పేరుతో ఈ రిపోర్ట్‌ను రూపొందించారు. దేశ జనాభాలో ఒక్క శాతంగా అత్యంత సంపన్నులపై అదనంగా వేసే పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా పేదల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయవచ్చని, సామాజిక వ్యయాన్ని పెంచడానికి ఉపయోగించవచ్చని రచయితలు, ఆర్థికవేత్తలు నితిన్‌కుమార్ భర్తి, లూకస్ చాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి సూచించారు. తద్వారా భారత్‌లో పెరుగుతున్న ఆదాయం, సంపద అసమానతలను తగ్గించవచ్చన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సర గణాంకాల ప్రకారం.. భారత జనాభాలో ఒక్క శాతమే ఉన్న అత్యంత సంపన్నవర్గమే దేశ ఆదాయంలో 22.6 శాతం, సంపదలో 40.1 శాతం వాటా కలిగి ఉంది. 2014-15 నుంచి 2022-23 మధ్య కాలంలో ఈ అసమానతలు మరింత భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదికలో నిపుణులు 'కోటీశ్వరుల పన్ను'ను ప్రతిపాదించారు. 2022-23లో రూ.10 కోట్లకు మించి సంపద ఉన్నవారికే ఈ పన్ను విధించాలన్నారు. ఈ స్థాయి కుటుంబాలు దేశంలో కేవలం 0.04 శాతం మాత్రమే ఉన్నాయని అంచనా వేశారు. కోటీశ్వరుల పన్ను విధానంలో బేస్‌లైన్, మోడరేట్, యాంబిషస్ పేర్లతో మూడు రకాలను ప్రతిపాదించారు. బేస్‌లైన్ కేటగిరీలో రూ.10 కోట్ల సంపద కలిగిన వారిపై రెండు శాతం పన్ను విధించాలి. రూ.10 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్లపై 33 శాతం వారసత్వ పన్ను వేయాలి. ఇదొక్కటే జీడీపీలో 2.7 శాతం రాబడిని పెంచుతుంది. మోడరేట్ కేటగిరీలో రూ.10 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య నికర సంపద కలిగిన వారిపై పన్నును నాలుగు శాతానికి పెంచాలి. ఇదే విలువ కలిగిన ఎస్టేట్లపై 33 శాతం వారసత్వ పన్ను వేయాలి. రూ.100 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్లకు వారసత్వ పన్ను 45 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ పన్ను విధానం భారత జీడీపీలో 4.6 శాతానికి సమానమైన ఆదాయాన్ని ఆర్జించగలదు. యాంబిషస్ పన్ను విధానంలో వ్యక్తులపై పన్ను రేట్లను 3 నుంచి 5 శాతం మధ్య, ఎస్టేట్లపై వారసత్వ పన్నును 45 శాతం నుంచి 55 శాతం మధ్య పన్ను పెంచాలని ప్రతిపాదించింది. దీంతో స్థూల జీడీపీలో పన్ను రాబడులు 6.1 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది. సంపన్నులపై వేసే పన్నులతో వచ్చే ఆదాయాన్ని పేదలకు నగదు బదిలీలు, విద్యా, వైద్యం, ఇతర సామాజిక రంగాలకు ఖర్చు చేయాలి. ప్రతిపాదిత సంపద పన్ను ప్యాకేజీలు సామాజికరంగ వ్యయాన్ని పెంచడానికి, సంపద సృష్టికి దోహదం చేస్తాయి. ఈ పన్నుల విధానం దేశంలోని కేవలం 0.04 శాతం మందిపైనే ప్రభావం చూపుతుంది కనుక ఇబ్బంది ఉండదు. భారత్‌లో ఆర్థిక అసమానతలు కులాలతోనూ లింకై ఉన్న విధానాన్ని ఈ రిపోర్ట్ విశ్లేషించింది. దేశంలోని అగ్ర కులాలే జాతీయ సంపదలో గణనీయమైన వాటా కలిగి ఉన్నాయి. భారతీయ బిలియనీర్లు ఎక్కువగా ఉన్నత కులాల వారే. ఈ పరిస్థితుల్లో సంపద పన్ను విధానం తక్కువ సంఖ్యలో ఉన్న అతి సంపన్న, ఉన్నత కుల కుటుంబాలపై మాత్రమే కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అదే సమయంలో అట్టడుగు కులాలు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. దీని ద్వారా సంపద అసమానతలను తొలగించడమే కాకుండా.. భారత్‌లోని సామాజిక, ఆర్థిక అసమానతల మధ్య దృఢమైన సంబంధాన్ని బలహీనపరచడంలో ఇటువంటి ప్రతిపాదిత కొత్త పన్ను వ్యవస్థ కీలక పాత్ర పోషించగలదని అని వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. మరి మన పాలకులు దీన్ని పరిగణనలోకి తీసుకుంటారా అంటే.. అనుమానమే!




## ప్రీతి..పంజాబ్..ఒక అయ్యర్!

పంజాబ్ కింగ్స్ జట్టు 11ఏళ్ల తర్వాత ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు చేరు కుంది. చివరిసారిగా 2014లో ప్లేఆఫ్‌కు అర్హత సాధించింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత టాప్-2లో నిలిచింది. ఈ రోజు బెంగ ళూరు, లక్నో మధ్య జరిగే మ్యాచ్‌లో ఆర్సీబీ విజయం సాధించడమే కాకుం డా.. రన్ రేట్ మెరుగుపరుచుకుంటే పంజాబ్ రెండో స్థానంలో నిలు స్తుంది. లేకపోతే పంజాబ్‌దే అగ్రస్థా నం. ఏదేమైనా ఫైనల్‌కు చేరుకోవడా నికి పంజాబ్‌కు రెండు అవకాశాలు మాత్రం గ్యారంటీగా ఉన్నాయి. ఐపీ ఎల్ చరిత్రలో మూడు వేర్వేరు జట్లను క్వాలిఫయర్స్-1కు తీసుకెళ్లిన ఘనత శ్రేయస్ అయ్యర్‌కు దక్కుతుంది. 2020లో ఢిల్లీ జట్టును మొదటిసారిగా ఫైనల్‌కు చేర్చాడు. ఇక గత సీజన్‌లో కేకేఆర్ జట్టుకు ఏకంగా ట్రోఫీనే అందించాడు. తాజాగా పంజాబ్ జట్టును క్వాలిఫయర్-1కు తీసుకెళ్లాడు. గతే డాది కేకేఆర్‌కు ట్రోఫీని అందించినా.. కోచ్ గౌతమ్ గంభీర్‌తో ఉన్న విభేదాల కారణంగా జట్టును వది లేశాడు. ఈ ఏడాది కేకేఆర్ జట్టు రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే లీగ్ నుంచి నిష్క్రమించింది. కానీ శ్రేయస్ నేతృత్వం లోని పంజాబ్ జట్టు ఫైనల్స్‌కు ఒక్క మ్యాచ్ దూరంలో నిలిచింది.

- బాయిజాన్

### ప్రీతీ.. ది గ్రేట్..

పంజాబ్ కింగ్స్ సహ భాగస్వామి, సినీ నటి ప్రీతీ జింటా తొలి టైటిల్ కోసం 18ఏళ్లుగా వేచి చూస్తోంది. ఇన్నేళ్లలో ఒక ఓనర్‌గా ప్రొఫెషనల్‌గానే కాకుండా.. జీవితంలో కూడా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. పంజాబ్ జట్టులో మోహిత్ బర్మన్ (డాబర్, ఎవరెడీ బ్యాటరీ కంపెనీల ఓనర్)కు 48శాతం, నెస్ వాడియా (బాంబే డయింగ్ ఓనర్)కు 23 శాతం, ప్రీతీ జింటాకు 23 శాతం, కరన్ పాల్ (ది పార్క్ హెూటల్స్ ఓనర్)కు 6 శాతం వాటాలున్నాయి. ఈ ఓనర్లలో ప్రతీ మ్యాచ్‌లో గ్యాలరీల్లో కనపడేది ప్రీతీ జింటా, నెస్‌వాడియాలే. వీళ్లద్దరూ కేవలం ఓనర్లే కాకుండా.. ఒకప్పుడు ప్రేమికులు. నెస్ వాడియాతో కొన్నేళ్ల పాటు ప్రీతీ జింటా రిలేషన్‌షిప్‌లో ఉంది. అయితే 2018లో వీరిద్దరి మధ్య తీవ్రమైన గొడవలు జరిగాయి. నెస్ వాడియా తనను వేధించాడని కన్నీళ్లు పెట్టుకుంది. వాంఖడే స్టేడియంలో అందరి ముందే తనను కొట్టాడని కేసు కూడా పెట్టింది. అప్పటికే ఆ జంట విడిపోయింది. కానీ ప్రీతీ మాత్రం పంజాబ్ కింగ్స్ భాగస్వామిగా కొనసాగింది. ఇక తాజాగా కో-ఓనర్స్ నెస్ వాడియా, మోహిత్ బర్మన్‌పై కేసు పెట్టింది. పంజాబ్ కింగ్స్ మాతృసంస్థ కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కొత్త డైరెక్టర్ నియామకానికి సంబంధించి నిబంధనలు పాటించకుండా.. ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రీతీ జింటా కేసు వేసింది. ఓనర్ల మధ్య వివాదాలు నడుస్తున్నా.. జట్టును ఎంకరేజ్ చేయడానికి ప్రీతీ మాత్రం స్టేడియంకు వస్తోంది. యాజమాన్యం గొడవలను పైకి కనపడనివ్వకుండా.. స్టేడియంలో నవ్వుతూ జట్టును ఉత్సాహపరుస్తోంది. ప్రీతీ అమెరికాకు చెందిన జెనీ గుడ్‌ఇనఫ్ అనే బిజినెస్ మ్యాన్‌ను పెళ్లి చేసుకొని అక్కడే ఉంటోంది. కానీ ఐపీఎల్ జరిగే రెండు నెలలు మాత్రం ఇండియాకు వస్తుంది. అయితే వచ్చిన ప్రతీ సారి పంజాబ్ కింగ్స్ ఓనర్లతో ఆమెకు గొడవలే జరుగుతున్నాయి. అయినా సరే పంజాబ్ జట్టు నుంచి తన వాటాను మాత్రం వెనక్కు తీసుకోవడం లేదు. తనకు క్రికెట్ అంటే ఇష్టమని.. పంజాబ్ జట్టు నాకు ప్రాణమని ఒక సారి చెప్పింది. 18 ఏళ్లుగా ఐపీఎల్ టైటిల్ కోసం కేవలం ఆర్సీబీనే కాదు.. అంతకు మించి ఎదురు చూస్తోంది ప్రీతీజింటానే. మరి ఈసారి ఆమె కల నెరవేరుతుందా లేదా చూడాలి.





## బేబమ్మ బోల్డ్ టాక్స్.. ఐనా కానీ..!

ఉప్పెనతో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న కృతిశెట్టి తొలి సినిమాతోనే యూత్ ఆడియన్స్ లో ఒక మంచి పాపులారిటీ సంపాదించింది. ఐతే ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ కొన్నాళ్లే ఉండగా ఆ తర్వాత ఒకటి రెండు సినిమాలు తప్ప తర్వాత అన్నీ కూడా నిరాశపరిచాయి. కృతి శెట్టి చేసిన సినిమాలన్నీ కూడా ఫ్లాప్ అవ్వడంతో ఆమెకు అవకాశాలు కూడా సన్నగిల్లాయి. తెలుగులో చివరగ మనమే సినిమా చేసింది బేబమ్మ. ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా రాలేదు. మరోపక్క తమిళ్ లో అమ్మడు ఎల్.ఐ.కె, జినీ సినిమాలు చేస్తుంది. ఆ రెండిటి మీదే అంచనాలను పెట్టుకుంది. ఈమధ్యలో మలయాళంలో కూడా ఒక సినిమా ట్రైల్ వేసిన అమ్మడు అక్కడ పర్వాలేదు అనిపించుకున్నా నెక్స్ట్ ఛాన్స్ లు మాత్రం రాలేదు. అందుకే కలిసి వచ్చిన టాలీవుడ్ మీదే ఇంకాస్త ఫోకస్ పెట్టాలని అనుకుంటుంది కృతి శెట్టి. ఐతే ఇన్నాళ్లు గ్లామర్ షో విషయంలో కాస్త మొహమాటం చూపించిన అమ్మడు ఇక మీదట గ్లామర్ గేట్లు ఎత్తేయాలని ఫిక్స్ అయ్యింది. అంతేకాదు ఏదైనా బోల్డ్ సబ్జెక్ట్ ఉన్నా కూడా చేయాలని చూస్తుందట. యూత్ ఆడియన్స్ కి ఈమధ్య కాస్త బోల్డ్ రోల్స్ చేసిన హీరోయిన్స్ ని ఎక్కువ ఇష్టపడుతున్నారు. ఐతే కెరీర్ లో ఇప్పటివరకు కృతి శెట్టి గ్లామర్ రోల్స్ చేసింది లేదు. ఆమెకు వచ్చిన అవకాశాలను చేస్తూ కెరీర్ వెళ్లదీసింది. ఐతే గేర్ మార్చి అమ్మడు గ్లామర్ రోల్స్ బోల్డ్ అటెంప్ట్ చేయాలని ఫిక్స్ అయ్యింది. అలా చేస్తేనన్నా ఆడియన్స్ లో తను ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేయగలనని అనుకుంటుంది అమ్మడు. కృతి శెట్టి యాక్టింగ్ పరంగా పర్వాలేదనిపిస్తున్నా ఇక మీదట దానికి తోడు గ్లామర్ షో కూడా తోడైతే కెరీర్ ఇంకాస్త బెటర్ గా ఉంటుందని భావిస్తుంది. ఐతే బేబమ్మ నిర్ణయం వల్ల నిజంగానే ఆమె కెరీర్ ఊపందుకుంటుందా లేదా అన్నది చూడాలి. క్లాస్ లుక్స్ తో కుర్రాళ్లను మెప్పించిన కృతి శెట్టి ఇక మీదట గ్లామర్ డోస్ పెంచి అదరగొట్టాలని చూస్తుంది. మరి అమ్మడి ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తానో కథానాయికకు కథ చెప్పానని, అయితే ఆ కథని లీక్ చేస్తోందని, ఓ దర్శకుడు ఎవరికి కథ చెప్పినా దాన్ని లీక్ చేయకూడదన్నది ఓ అలిఖిత నిబంధన అని, దాన్ని సదరు కథానాయిక బ్రేక్ చేస్తోందని, ఇదేం ఫెమినిజం? అని ప్రశ్నించారు. "నాకు సినిమానే ప్రపంచం. ఓ కథ రాసుకోవడానికి సంవత్సరాలు కష్టపడతా. దాన్ని మీరు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు. ఏం కావాలంటే అది చేసుకోండి. నేనెప్పటికీ భయపడను" అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ దీపికా పదుకొణేని ఉద్దేశించి చేసిందే అన్నది అందరి అభిప్రాయం. ఎందుకంటే ఈమధ్యే ఆయన దీపికకు స్పిరిట్ కథ చెప్పారు. కథానాయికగా తీసుకొందామనుకొన్నారు. కానీ మధ్యలో దీపిక-సందీప్ మధ్య అభిప్రాయ బేధాలొచ్చాయి. దాంతో దీపిక పక్కకు వెళ్లిపోయింది. ఆ స్థానంలో త్రిప్తిని ఎంచుకొన్నారు. అయితే తనని పక్కన పెట్టారన్న కోపంతో దీపిక రగిలిపోతోందని, అందుకే స్పిరిట్ కథని అందరికీ లీక్ చేస్తోందని, అంతే కాకుండా ఇదో ఏ గ్రేడ్ సినిమా అంటూ ప్రచారం చేస్తోందని తెలుస్తోంది. ఈ విషయం సందీప్ రెడ్డికి తెలిసింది. దాంతో ఇలా స్పందించాల్సివచ్చింది. అయినా దీపికా లాంటి స్టార్ మరీ ఇంత చిన్నపిల్లలా ప్రవర్తించడం ఏమిటో అర్థం కావడం లేదు. తనని పక్కన పెట్టారన్న పంతం, కోపం ఇలా ప్రదర్శిస్తే నటిగా తన స్పిరిట్ ఏమైనట్టు? ఓ సినిమా నుంచి ఓ కథానాయికని తప్పించడం కొత్తగా జరిగిందేం కాదు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## ఇదేం 'స్పిరిట్' దీపికా??

## ఇలాంటివన్నీ విష్ణుకే జరుగుతాయేంటో..?!

కన్నప్ప' హార్డ్‌డిస్క్ మాయమైంది. ఈ వ్యవహారంలో ఇద్దరు వ్యక్తులపై కేస్ పెట్టింది 'కన్నప్ప' టీమ్. కన్నప్ప హార్డ్ డిస్క్ పట్టుకొని ఇద్దరు పారిపోయారని, వాళ్లని పట్టుకోవాలని పోలీసుల్ని కోరారు కన్నప్ప ఎగ్జిక్యూటీవ్ ప్రొడ్యూసర్. కన్నప్ప సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాల్ని ముంబైలోని ఓ స్టూడియోలో విజువల్ ఎఫెక్ట్స్ చేయించారు. వాళ్లేమో ఆ సన్నివేశాల్ని హార్డ్‌డిస్క్‌లో పెట్టి కొరియర్ చేశారు. ఆ కొరియర్ అందుకొన్న ఆఫీస్ బాయ్ రఘు దాన్ని తన దగ్గరే అట్టిపెట్టుకొన్నాడు. ఇప్పుడు మరో మహిళతో కలిసి పరార్ అయ్యాడు. ఆ హార్డ్ డిస్క్ కోసం ఇప్పుడు పోలీసుల్ని ఆశ్రయించింది టీమ్. విష్ణు చెబుతోంది నిజమే అయితే 'కన్నప్ప' రూ.200 కోట్ల సినిమా. అలాంటి ఖరీదైన సినిమాలోని సన్నివేశాల్ని ఇలా కొరియర్లలో పంపిస్తారా ఎవరైనా? ఒకవేళ హార్డ్‌డిస్క్ మిస్ అయినా, సాఫ్ట్ కాపీ సదరు స్టూడియోలో ఉంటుంది కాబట్టి బెంగ పడాల్సిన పనిలేదు. అయితే ఈలోగా ఆ సన్నివేశాలు లీక్ చేస్తారేమో అనే భయం విష్ణుకి ఉండి ఉంటుంది. పారిపోయిన ఇద్దరూ ఒకరి 'గైడెన్స్'లో నడుస్తున్నారని, దీని వెనుక ఓ అజ్ఞాత వ్యక్తి ఉన్నారని ఆ కంప్లైంట్ లో పేర్కొన్నారని తెలుస్తోంది. మంచు మనోజ్ తో విష్ణుకి గొడవలున్న సంగతి తెలిసిందే. విష్ణు కూడా ఇక్కడ పరోక్షంగా మంచు మనోజ్ పేరే ప్రస్తావించాడనిపిస్తోంది. జనరేటర్‌లో పంచదార పోయడం.. హార్డ్ డిస్కులు ఎత్తుకుపోవడం.. ఇలాంటివన్నీ మంచు కుటుంబంలోనే జరుగుతాయెందుకో మరి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



## తలసేమియా బాధితులకు అండగా..!

- రక్తదానం చేసిన చిన్న మురపాక యువత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లావేరు మండలం చిన్న మురపాక గ్రామానికి చెందిన యువకులు, శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఎస్‌వీవైఎస్ సభ్యులు రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా పిల్లలకు అండగా నిలిచారు. ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా రక్తదాతలు ముందుకు రాకపోవడంతో శ్రీకాకుళం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్త నిల్వలు లేవు. ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ నిర్వాహకులు పెంకి చైతన్య మురపాక గ్రామానికి చెందిన శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఎస్‌వీవైఎస్ అధ్యక్షులు బాలి శ్రీనివాస నాయుడులకు తెలియజేశారు. వెంటనే వారు యువతతో మాట్లాడి చిన్న మురపాక గ్రామానికి చెందిన శ్రీ వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు ఇప్పిలి రాంబాబు జన్మదినం రక్తదానానికి వేదిక కావాలని పిలుపునిచ్చారు. అనుకున్నదే తడవుగా పుట్టినరోజు వేడుకలు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న యువత శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయానికి వెళ్లి 19 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం టూ టౌన్ ఎస్ఐ సంతోష్ కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావులు వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మురపాక వార్డు సభ్యులు నాలి రవికుమార్, శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఉపాధ్యక్షులు గొర్లె శ్రీనుబాబు, సభ్యులు పిసిని రాంబాబు, గొండు రమణ, నాజాన సాయికుమార్, ఇప్పిలి ప్రకాష్, చిన్న మురపాక యువకులు గళావెల్లి మాధవ, చందక రమేష్, దన్నాన రామినాయుడు, నాగ, రెడ్‌క్రాస్ సిబ్బంది సత్యనారాయణ, వెంకటేష్, మీసాల సంతోష్, నాగు తదితరులు పాల్గొన్నారు.




## శిష్టకరణ కులస్తులకు శిష్టరత్న అవార్డులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను "శిష్టరత్న" పేరిట అవార్డులు ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణలు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన శిష్టకరణం విద్యార్థులకు మాత్రమే ఈ అవార్డులు ఇస్తామన్నారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు అర్హులన్నారు. దీంతోపాటు ఏపీ, తెలంగాణాల్లో ఎంసెట్‌లో 200లోపు ర్యాంకులు వచ్చినవారు, నీట్ ద్వారా మెడికల్ సీట్ సాధించిన వారు కూడా అర్హులన్నారు. ఈనెల 8న స్థానిక మహాలక్ష్మి నగర్ కాలనీ, ఛాయా నగర్‌లో (శ్రీ చైతన్య టెక్నో స్కూల్ దగ్గర) ఉన్న శిష్టకరణసామాజిక భవనంలో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహిస్తామన్నారు. అర్హత గల విద్యార్థులు వచ్చేనెల 4లోపు తమ ర్యాంక్‌కార్డు, అడ్మిషన్ లెటర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్, చిరునామా కోసం ఆధార్ కార్డు, తల్లిదండ్రుల పేర్లను 9848254247కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. కమిటీకి అందిన వివరాలను పరిశీలించి అర్హతను నిర్ధారించి అవార్డులు పొందే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తామన్నారు. విద్యార్థి అందుబాటులో లేనప్పుడు, అవార్డును తల్లిదండ్రులకు అందజేయబడుతుందన్నారు

## పరుశురాం పాత్రో విగ్రహానికి నివాళులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్న అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా ఉండి ఆంధ్ర విశ్వ విద్యాలయం స్థాపనకు కారకులైన స్వర్గీయ అన్నేపు పరాసురామ్ పాత్రో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అన్నేపు రవిపాత్రో (పాత్రో మనవడు), విశాఖపట్నం వైకాపా విశాఖపట్నం జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు, కళింగ మాజీ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్‌లు పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మొదలవలస సుదర్శన్, కూన సన్యాసిరావు, లకినేని ప్రదీప్, పేడాడ అప్పలనాయుడు (స్కాలర్ ఎకనామిక్స్), సంపతిరావు వెంకటరమణ (స్కాలర్ తెలుగు విభాగం) పప్పల మోహన్‌రావు (కంప్యూటర్ సైన్స్ స్కాలర్), తమ్మినేని సంతోష్‌కుమార్ (కామర్స్ స్కాలర్) బెండి శ్రీధర్ (జియో ఇంజనీరింగ్ స్కాలర్, సువ్వారి వెంకటరమణ (బ్యాంకు మేనేజర్) సువ్వారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వీరేశలింగం పంతులు, జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు, మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి జరిపారు ఈ సందర్భంగా మహాత్మా గాంధీ నెహ్రూ గిడుగు రామ్మూర్తి, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ గురించి అవగాహన కల్పించి చిత్రపటాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాల కథానిలయం అధ్యక్షులు లైన్స్ క్లబ్ సెంట్రల్ ఉపాధ్యక్షులు భోగిల ఉమామహేశ్వరరావు సహాయకురాలు కె. అనిత 30 యొక్క మంది విద్యార్థులు పాల్గొన్నారు





కడపలో శుక్రవారం ప్రారంభమైన మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో అరవల రవీంద్రబాబు, పీఎంజే బాబు, శింతు సుధాకర్, పాండ్రంకి శంకర్, విభూతి సూరిబాబు, ప్రధాన విజయరాం, మైలపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

## అహల్యాభాయి హోల్కర్ జీవితం అందరికీ ఆదర్శం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పుణ్య శ్లోక రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు బీజేపీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్థానిక బాపూజీ కళాక్షేత్రంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3000 దేవాలయాలను 200 ప్రాంతాల్లో నిర్మించిన ఘనత అహల్యా బాయి హోల్కర్‌కే దక్కుతుందన్నారు. 30ఏళ్ల పాటు ఆమె పాలించిన తీరు, చేసిన సేవ చిరస్మరణీయమన్నారు. ఆమె చరిత్ర అందరికీ తెలియాలన్న ఉద్దేశ్యంతో ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా ఆమె జయంతి వేడుకలు నిర్వహించాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పోకతోట సింహాచలం, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వరావు, సలాన రాఘవరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ, గొలివి కరుణాకర్‌రావు, లక్ష్మి రెడ్డి, వివిధ మోర్చాల కార్యకర్తలు, బీజేపీ జిల్లా బాధ్యత నాయకులు పాల్గొన్నారు.




## నిరాశ్రయులకు ఆహారం పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కెల్లవీధికి చెందిన కొల్లి శివకుమార్, ఝాన్సిల పెళ్లి రోజు సందర్భంగా నగరంలో నిస్సహాయులకు అన్నదానం చేశారు. గొంటివీధిలోని పట్టణ నిరాశ్రయుల భవనంలో శివకుమార్, ఝాన్సి కుటుంబ సభ్యులు అన్నవితరణ చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నైట్‌షెల్టర్లలో తలదాచుకుంటున్న నిరాశ్రయులు పడుతున్న కష్టాలు తెలుసుకున్నామని, తమ పెళ్లిరోజున వారికి ఆహారాన్ని అందించటం సంతోషంగా ఉందన్నారు. వేడుకలకు వృధాగా అధిక ధనాన్ని వెచ్చించే బదులు పేదల కడుపు నింపే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఝాన్సి కుటుంబ సభ్యులు, కొల్లి శివకుమార్, సామాజిక సేవకులు ఉర్లం శివతేజ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, పొడుగు చరణ్ పాల్గొన్నారు.



## యోగాంధ్రలో పాల్గొన్న మాజీ సైనికులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు మంగళవారం ఉదయం డచ్ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించిన యోగాంధ్రలో జిల్లా మాజీ సైనికులు భాగ స్వామ్యులైనట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం పేర్కొన్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ యోగా అనేది దైనిక జీవితంలో ఒక భాగం కావాలన్నారు. సులభంగా ఈ యోగా ద్వారానే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వానికి, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్‌కి మాజీ సైనికుల తరుపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు. ఆరోగ్యవంతమైన శరీరం ఉన్ననాడే మనం ఏదైనా సాధించవచ్చని, ఉన్నతమైన ఆలోచనలు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్.డి.ఓ. కె.సాయి ప్రత్యూష, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, సిబ్బంది సువ్వారి ఈశ్వరరావు, భైరి మురళీ, బెండి సుధాకర్, దుంపల శాంతమ్మ, కెప్టెన్ పి.ఈశ్వరరావు, జనరల్ సెక్రటరీ పి.మురళీధర్‌రావు, ఎస్. లక్ష్మణరావు, తమ్మినేని కృష్ణారావు, తర్రా కృష్ణారావు, ఎస్.రామక్రిష్ణ, ఎం.సింహాచలం, జాయింట్ సెక్రటరీ పైడి రామారావు, మాజీ సైనికుల స్టేట్ లీగల్ అడ్వైజర్ ఎస్.రమణ మూర్తి, స్టేట్ నార్తర్న్ జోన్ మహిళా సెక్రటరీ పి.పద్మావతి, అడ్వైజర్ అరి వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బి.రాంబాబు, డి.వాసుదేవరావు, ఎస్.అప్పలసూరి, ఎమ్.రాములు, జి.గోవిందరావు, కూన శ్రీనివాస్, లింగుబేరి రామారావు, ఇ.రాజారావు, కె. రాజేంద్రప్రసాదరావు, కె.రాజశేఖర్, బి.వి. నారాయణ, పి.చిన్నారావు, పి.శ్రీనివాసరావు, బి.కామేశ్వర రావు, డి.భారతి, వంజరాపు లక్ష్మి, ఆర్జి వరలక్ష్మి, కుంచాల రంజని, రోణంకి శివసాయి సాత్విక్ పాల్గొన్నారు.



## ఎస్జీటీల బదిలీలో మాన్యువల్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదలీలలో మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షురాలు ఎస్‌వీఎస్ఎల్ పూర్ణిమ, ప్రధాన కార్యదర్శి కె.జగన్మోహన్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎనిమిదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి 24పాయింట్లు అదనంగా ఇవ్వాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ కోరటం వెనుక గల కారణాలను వివరించారు. 100 లోపు ప్లేసెస్ ఆప్షన్ ఇవ్వాల్సి వచ్చినపుడు మాత్రమే ఆన్‌లైన్ కౌన్సిలింగ్ మంచిదన్నారు. ఎస్జీటీలు ఏ జిల్లాలో చూసినా 2500 మందికి పైగానే ఉన్నారన్నారు. అందరూ రియాపోర్షన్మెంట్‌నో లేదా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న మాత్రమే ఉన్నారన్నారు. వారు రెండు వేల నుంచి మూడు వేల వరకు ప్లేస్‌లను ప్రాధాన్యతా క్రమంలో ఇవ్వడం చాలా కష్టంతో కూడుకున్న విషయమన్నారు. దీని వలన ఆ ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. పొరపాటున ఒక స్కూల్ పేరు బదులుగా మరో స్కూల్ పేరు టచ్ అయిపోతే ఆ స్కూల్ ప్రాధాన్యతలో చేరిపోతుందన్నారు. ఇలా ఇప్పటి వరకు చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 3000 లేదా 4000 ప్రాధాన్యతలో ఒక 300 ఇస్తే చాలు తరువాతవి యాడ్ చేసేయొచ్చు అనుకుంటే పొరపాటేనన్నారు. అన్ని స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో ఒకేసారి ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇది చేయటం చాలా కష్టతరమైనదని వారు వివరించారు. తమ కంటే తరువాత ఉండేవారి ఖాళీ చేసే స్థానం ఏరేజింగ్ వేకెన్సీగా వస్తుందని నమ్మిస్తారన్నారు. కానీ ఈ తరహావి చాలా అరుదుగా మాత్రమే వస్తాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కంపల్సరీ వాళ్ళకే ప్లేసెస్ ఉండకపోతే తక్కువ పాయింట్స్ వచ్చేవారికి వేరే ప్లేస్ వచ్చే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండబోదన్నారు. దీనిని బట్టి ఎరేజింగ్‌లు ఉండవన్న విషయం గ్రహించాలన్నారు. దీని వలన ఎస్జీటీలకు ఎవరికీ ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. అధికారులకు శ్రమ లేకపోవడం, సమయం వృధా కాకుండా ఉండడం కోసం ఎస్జీటీలను బలి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీని కోసమే ఆన్లైన్ చేద్దాం అంటున్నారన్నారు. జిల్లాలోలో పని చేసే ఉపాధ్యాయులందరూ ఆ జిల్లా పూర్తి భౌగోళిక అవగాహన కలిగి ఉండరన్నారు. ముఖ్యంగా మహిళ ఉపాధ్యాయులకు మరింత కష్టతరంగా ఉంటుందన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్ వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత పెద్దగా ప్లేసెస్ గురించి విచారణ లేకుండా ప్రత్యక్షంగా కౌన్సిలింగ్‌కి హాజరు కావచ్చన్నారు. అక్కడ ఉన్న ప్లేస్‌లో మంచి ప్లేస్ కోసం బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవచ్చన్నారు. కౌన్సిలింగ్‌లో ఒక స్కూల్‌కి సంబంధించి వివరాలు అక్కడికక్కడే తెల్సుకుని, లేదా స్నేహితులను కనుక్కునే వీలుంటుందన్నారు. స్పౌజ్ కోటా కోసం వారికి మరింత లాభం చేకూరుతుందన్నారు. మన ముందు ఖాళీ చేసి అప్పటికప్పుడు వేకెన్సీస్ ఎరేజ్ అయ్యే ప్రయోజనం కేవలం మాన్యువల్‌లోనే ఉంటుందన్నారు. తక్కువ పాయింట్‌లు ఉన్నవారు అన్నీ స్కూల్స్ గురించి తెలుసుకోవలసిన అవసరం ఉండదన్నారు. వారి నెంబర్ వచ్చినప్పటికి ఉన్న వేకెన్సీస్ గురించి తెలుసుకుంటే చాలన్నారు. దీని వలన మానసిక ఒత్తిడి ఉండదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చివరలో మంచి వేకెన్సీస్ లేకపోయినా ఉన్న వాటిలో మంచిది ఎంచుకోవచ్చన్నారు. చివరగా ఆన్లైన్ కౌన్సిలింగ్ అంటే 50/100 ప్రాధాన్యతలు ఇచ్చే కాలేజీ అడ్మిషన్స్ లేదా కొన్ని రకాల జిల్లా స్థాయి తక్కువ సంఖ్యలో ఉన్న ఉద్యోగానికి మాత్రమే ఉండాలన్నారు. కానీ ఎస్జీటీ వంటి ఎక్కువ క్యాడర్ వారికిఎంతమాత్రం ఉపయోగం ఉండదన్నారు. పైగా నష్టం కూడా చేకూరుతుందన్నారు. పై ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఈ బదిలీల్లో స్టేషన్ పాయింట్స్ విషయంలో ఎనిమిదేళ్లు సీలింగ్ పెట్టారన్నారు. అదేవిధంగా 2017 ట్రాన్స్ఫర్స్ బ్యాచ్‌కి ఎనిమిదేళ్లు పూర్తి కాకుండానే అకడమిక్ ఇయర్ పేరుతో ఎనిమిదేళ్లు పూర్తయినట్లు చూపిస్తున్నారన్నారు. దీని వలన నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. వీరికి ఎనిమిదేళ్లు పూర్తయిన తరువాత 24 పాయింట్లు కలిపే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా ఉంది

(సత్యంన్యూస్, పాతపట్నం)



డా. బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం కాకుండా, తెలుగుదేశం పార్టీ నేతల 'రెడ్ బుక్' రాజ్యాంగమే రాష్ట్రంలో అమలవుతోందని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని, పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులను పావులుగా వాడుకుంటూ, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేస్తున్నారని, పౌర హక్కులు, మానవ హక్కులను హరిస్తున్నారన్నారు. గతంలో మంత్రి నారా లోకేష్ "రెడ్ బుక్"లో రాసి పెట్టుకున్నానని, అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటానని పలుమార్లు ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక "రెడ్ బుక్ పాలన" మొదలైందని ఆయనే స్వయంగా ప్రకటించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, అమలవుతున్నది "రెడ్ బుక్" మాత్రమేనని ఆమె ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ "రెడ్ బుక్" పాలన రోజురోజుకు మితిమీరుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తున్నందుకే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆమె అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా శ్రేణులు, నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్.
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్ కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

### వెనుక వీధులు నిండిపోడానికి కారణమైన

# కాలువలు సరిచేయండి

- మురుగు సమస్య మాట రాకూడదు
- కాలువలు వాటం సరిగా ఉండాలి
- ప్రస్తుతానికి సిల్ట్ పూర్తిగా తొలగించండి
- మున్సిపల్ హెల్త్ఫీసర్ సుధీర్
- తుమ్మావీధిలో రెండో రోజూ స్పెషల్ డ్రైవ్
- దగ్గరుండి పనుల పర్యవేక్షణ





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వెనుక వీధులు నిండిపోవడానికి కారణమైన కాలువల ఎత్తు సరిచేసి వాటంగా ఉండేలా చూడాలని హెల్త్ఫీసర్ సుధీర్ శానిటరీ వర్కర్స్‌కు సూచించారు. ఈమేరకు రెండో రోజు మంగళవారం ఉదయం దగ్గరుండి కాలువల్లో సిల్ట్ తొలగించే పనులను పర్యవేక్షించారు. రామమందిరం, తదితర ప్రాంతాల్లో కాలువలు నిండిపోయి, రోడ్డుపై నీరు నిలిచిపోడానికి కారణమైన కొన్ని కాలువలను వాటం సరిపోయేలా తవ్వించారు. సిల్ట్‌తీత పనులు పూర్తిగా చేపట్టాలని, మురుగు నిలిచిపోయిందన్న మాట రాకూడదని అన్నారు. రాజరాజేశ్వరి పీఠం వైపు వెళ్లే పెద్ద కాలువలో పూడిక పేరుకుపోవడంతో జేసీబీ పెట్టి మురుగు తొలగించారు. అలాగే పీఠం దరిలో ఉన్న కల్వర్టు కింద పూడిక పేరుకుపోయిందని, దాని తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. పనుల పరిశీలనలో టీడీపీ నాయకులు గుడి చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శానిటరీ మేస్త్రిలు పాల్గొన్నారు.



## యోగాపై విద్యార్థులకు శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి విద్యార్థి యోగా చేయాలని యోగా శిక్షకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రామస్థాయిలో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవమని, ఈ సందర్భంగా గ్రంధాలయంలో ప్రతిరోజు ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పలు యోగాసనాలను వేసి విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



### పోలీసుల ఉడుంపట్టు..

# బెట్టింగు బాబుల ఆటకట్టు!

మొదటిపేజీ తరువాయి

భాగంగానే పాకాల కిశోర్, ధనుంజయలను కొద్ది రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. తమపై పోలీసు నిఘా ఉందని వీరికి ముందే తెలియడం వల్ల జీతగాళ్లను పెట్టుకొని దందా నెరిపారు. ఇందులో భాగంగానే పాకాల కిశోర్ రవితేజ అనే వ్యక్తి ఫోన్ నెంబరు ద్వారా యాప్ ఐడీ పాస్‌వర్డ్‌లు ఇవ్వడం, వాడి ఫోన్ నెంబరు ద్వారానే చెల్లింపులు చేయడంతో కిశోర్, ధనుంజయతో పాటు రవితేజను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తే విస్తుగొలిపే విషయాలు బయటకొచ్చాయట. ఒప్పంగి ధనుంజయకు జూదం, క్రికెట్ బెట్టింగే ప్రధాన వృత్తి. ఇప్పుడు పోలీసుల అదుపులో ఉన్న ధనుంజయను ఎట్టి పరిస్థితుల్లోను బయటకు తీసుకురావడానికి పెద్ద స్థాయిలో లాబీయింగ్ నడుస్తున్నట్టు భోగట్టా. పాకాల కిశోర్ దగ్గర పనిచేస్తున్న రవితేజ కాల్‌డేటా, ఫోన్‌పే చెల్లింపుల వివరాల మేరకు ఒక అవగాహనకు వచ్చిన సీసీఎస్ పోలీసులు కిశోర్‌కు, ఒడిశా బరంపురం శ్రీనుకు మధ్య క్రికెట్ బెట్టింగ్ విషయంలో లావాదేవీలు జరిగాయని గుర్తించారు. అందులో భాగంగానే సోమవారం నుంచి ఆయన్ను సీసీఎస్ స్టేషన్‌లో పెట్టి విచారిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో ఉంటూ విశాఖపట్నం ఆర్‌కే బీచ్ ఒడ్డున ఒక అపార్ట్‌మెంట్ తీసుకొని క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న తనూజ్ పేరు కూడా పోలీసు విచారణలో బయటపడినట్లు తెలిసింది. తనూజ్‌కు, పాకాల కిశోర్‌కు మధ్య కూడా లావాదేవీలు నడిచాయని పోలీసులు గుర్తించారని తెలిసింది. బరంపురం శ్రీను ఎవరెవరి దగ్గర బెట్టింగ్‌కు దిగారో చెబితే వారిని కూడా స్టేషన్‌కు తెస్తామని పోలీసులు హామీ ఇచ్చినట్టు భోగట్టా.

#### డబ్బులిచ్చి ఆడించడం.. వడ్డీలు దండుకోవడం..

కళ్లేపల్లిలో పేకాడుతుండగా పోలీసులు దాడులు చేస్తే, వారిని నెట్టేసి మరీ పారిపోయిన వైష్ణవువీధికి చెందిన బాక్సర్ హేమంత్‌కుమార్‌ది మరో కథ. చేయడానికి ఇతిమిద్ధంగా ఇదీ అనే పని లేకపోయినా దాదాపు కోటిన్నర రూపాయలు విలువ కలిగిన ఆస్తులున్న హేమంత్ కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. ఆడించినోడుంటే అప్పు చేసైనా ఆడుతారనడానికి హేమంత్ కథే నిదర్శనం. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ పేకాట జరుగుతున్నా హేమంత్ కుమార్‌కు ముందే ఇన్ఫర్మేషన్ అందుతుంది. పేకాడటానికి వచ్చినవారికి ముందుగా రూ.10వేలు ఇస్తాడు. వెంటనే ఆట గెలిస్తే, దానికి రూ.500 కలిపి వసూలు చేస్తాడు. అలా ఎంతమంది వాడినా స్పాట్‌లోనే వడ్డీ, అసలు వసూలు చేస్తాడు. ఇక ఆటలో ఓడిపోతే చక్రవడ్డీ, బారువడ్డీ లాంటివి కలిపి ఇంటిమీదకు వెళ్తాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రావడంలో అనుభవం, కండలు తిరిగిన ఒళ్లు ఉండటంతో తంతాడనే భయంతో భార్యల పుస్తెలమ్మి మరీ కుమార్‌కు డబ్బులు చెల్లిస్తుంటారు. వీడిలాగే నానుబాలవీధికి చెందిన బంకు రాజు కూడా స్పాట్‌లో వడ్డీకి డబ్బులిస్తుంటారు. ఇది కాకుండా పేకాట శిబిరం పరిసర ప్రాంతాల వైపు ఎవరూ కన్నెత్తి చూడకుండా కాపలా కాయడం కోసం ఒక్కో వ్యక్తి నుంచి రూ.500 వసూలు చేస్తాడు. వీరిద్దరూ పేకాడిన వారి నుంచి దోచుకొని గట్టిగా సొమ్ము సంపాదించినట్లు పోలీసులకు తెలుసు.

#### ఇంటర్నెట్ సెంటర్ బాయ్ నుంచి సొంత యాప్ సృష్టి వరకు..

శ్రీకాకుళంలో గారవీధికి చెందిన అభినవ్ (చిన్నా) కొన్నాళ్ల క్రితం ఆ మెయిన్ రోడ్డులోనే ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో బాయ్‌గా పని చేశాడు. ఆ తర్వాత గాబర శ్రీను దగ్గర బెట్టింగులు ఆడటం, అనంతరం అక్కడే కలెక్షన్ బాయ్‌గా చేరడం ద్వారా అనుభవం సంపాదించాడు. ఈలోగా ఇంటర్నెట్ సెంటర్‌లో నాలుగు ముక్కలు నేర్చుకొని ఎచ్చెర్లలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ విభాగంలో పనికి చేరాడు. ఆ తర్వాత నగరానికి చెందిన ఓ ప్రముఖుడి కూతుర్ని బుట్టలో వేసుకొని పెళ్లి వరకు కథ నడిపించడంతో అభినవ్‌కు సొమ్ములిచ్చి పిల్ల తండ్రి వదిలించుకున్నాడు. దీన్నే పెట్టుబడిగా ప్రారంభించి క్రికెట్ బెట్టింగ్‌లో మూడో కంటికి తెలీకుండా ఓ కొత్త సామ్రాజ్యాన్ని అభినవ్, వాడి బావ శివారెడ్డి కలిసి స్థాపించేశారు. శ్రీకాకుళం నగరంలో తమ మధ్య పోటీ ఎందుకని ఎనిమిది మంది సిండికేటైతే కనీసం వారికి కూడా తెలియకుండా వీరిద్దరూ కలిసి ఒక ప్రత్యేకమైన బెట్టింగ్ యాప్ సృష్టించి కోట్లు కొల్లగొట్టేశారు. అభినవ్ బావ శివారెడ్డి గతంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద జ్యూస్ షాపు నడిపేవాడు. కానీ ఇప్పుడు వీరి ఆస్తులు తుమ్మావీధిలో విలువైన స్థలం, తుపాకుల బిల్డింగ్ వద్ద విలువైన స్థలం, ఎంపీడీవో కార్యాలయం వద్ద కోట్లు విలువ చేసే భవనం... ఇలా చెప్పుకుంటూపోతే సొంత యాప్‌ను సృష్టించి అందులో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియకుండా వీరు సొమ్ములు కొట్టేశారు. ఆ మాటకొస్తే సిండికేట్‌గా ఏర్పడి బెట్టింగులకు యాప్‌లు రెంట్‌కు తెస్తున్న ఈ ఎనిమిది మందికంటే బావా బావమరిది సంపాదించిందే ఎక్కువ.

### అక్రమాలే పునాది..

# భద్రతకు సమాధి

మొదటిపేజీ తరువాయి

రంగప్రవేశంతో అసలు ప్రమాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాజమాన్యం దిగివచ్చింది. ఈ నేపథ్యంలో రాజకీయ నేపథ్యం, అధికారులతో లాలూచీ ఒప్పందాలతో క్వారీల నిర్వాహకులు కార్మికుల భద్రతను గాలికొదిలేసి, అనుమతుల్లేకుండానే ఇష్టారాజ్యంగా పేలుళ్లు నిర్వహిస్తూ ఆదాయం పెంచుకుంటున్నట్లు మెళియాపుట్టి ఘటన మరోసారి బట్టబయలు చేసింది.

#### పారని పిడుగుపాటు ప్రచారం

గనుల శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో గ్రానైట్, రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్‌కు సంబంధించి 301 క్వారీలు ఉన్నాయి. వీటిలో సుమారు 70 శాతం క్వారీలకు పూర్తిస్థాయిలో అనుమతులు లేవు. అలాగే 90 శాతం క్వారీలకు బ్లాస్టింగ్ అనుమతులు లేవు. అయినా జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి యథేచ్ఛగా బ్లాస్టింగులు నిర్వహిస్తున్నారు. పోనీ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలైనా పాటిస్తున్నారా అంటే అదీ లేదు. దీని ఫలితమే ఇటీవల మెళియాపుట్టి మండలం దీనబంధుపురం గ్రామం వద్ద ఉన్న వీఆర్‌పీ గ్రానైట్స్ క్వారీలో ముగ్గురు కార్మికులు పేలుడులో మృతి చెందిన దుర్ఘటన. అక్కడి సర్వే నెం.13లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే సమీప బంధువైన ఒకానొక రెడ్డి ఈ క్వారీని నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మెళియాపుట్టి పోలీసులు కేసు నమోదు చేసినా దాన్ని పిడుగుపాటు ఘటనగా చూపించేందుకు అటు పోలీసులు, ఇటు క్వారీ యాజమానులు ప్రయత్నించారు. కానీ జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి క్వారీని తనిఖీ చేయడంతో రెండు రోజుల తర్వాత అసలు విషయం బయటకొచ్చింది. దాంతో గత్యంతరం లేక వీఆర్‌పీ యాజమాన్యం దిగొచ్చి బాధితులకు చెరో రూ.17 లక్షలు చొప్పున రూ.51 లక్షలు ఇవ్వడానికి అంగీకరించి రూ.25 లక్షలు అప్పటికప్పుడే చెల్లించింది. మిగతా మొత్తం జూన్ మొదటి వారంలో ఇవ్వడానికి అంగీకారం కుదిరినట్టు తెలిసింది.

#### పూర్తి అనుమతులు రాకుండానే..

మొత్తం ఏడు హెక్టార్లలో రెండు లీజులు పొందిన వీఆర్‌పీ యాజమాన్యం మొదట లీజు పొందిన 4.5 హెక్టార్లలో రెండేళ్ల పాటు గ్రానైట్ వెలికితీశారు. అయితే పెట్టుబడికి తగ్గట్టుగా గ్రానైట్ లభించకపోవడంతో ఆ పక్క స్థలాన్నే రెండో లీజు తీసుకుని క్వారీ ప్రారంభించారని తెలిసింది. అయితే ప్రభుత్వం నుంచి లీజు అనుమతి ప్రక్రియ పూర్తి కాకుండానే పనులు ప్రారంభించి బ్లాస్టింగ్ చేయగా ముగ్గురు మృతిచెందారు. సాంకేతిక కారణాలతో పాటు ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోకుండానే బ్లాస్టింగ్ చేయడం వల్ల ప్రమాదం జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పేలుడు ధాటికి ముగ్గురు కార్మికుల శరీరాలు ఛిద్రమైపోయాయి. పిడుగుపాటు వల్ల మృతి చెందారని నమ్మించేందుకు మృతదేహాలను ఘటనా స్థలం నుంచి క్వారీ బయటకు తీసుకువచ్చారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఘటన జరిగిన రెండు గంటల తర్వాత మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే విషయం తెలిసిపోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహాలను చూసి బ్లాస్టింగ్ వల్లే మృతి చెందారని అనుమానం వ్యక్తం చేసినా రాజకీయ అండతో అది పిడుగుపాటేనని యాజమాన్యం దబాయించగా, పోలీసులు వారికి వంత పాడారు. అయితే బాధితులు, గ్రామస్తులు ఆందోళన చేయడం, కలెక్టర్, ఎస్పీలు వెళ్లడంతో క్వారీ యాజమాన్యం దారిలోకి వచ్చింది.

#### ముడుపులు కట్టామన్న ధీమాతో నిర్లక్ష్యం

అధికారంలో పార్టీ, ప్రభుత్వ పెద్దలకు కప్పం కట్టి తగిన అనుమతులు తీసుకోకుండానే క్వారీలు నిర్వహించడం జిల్లాలో సర్వసాధారణమైపోయింది. ప్రతి క్వారీ నుంచి ఆ ప్రాంత పోలీస్ స్టేషన్‌కు రూ.10 వేలు, డివిజనల్ మైన్స్ అధికారులకు రూ.10వేలు చొప్పున నెలవారీ మామూళ్లు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అది కాకుండా కలెక్షన్లు అవసరమైనప్పుడల్లా జిల్లా గనుల శాఖ అధికారులు తనిఖీల పేరుతో హడావుడి చేస్తుంటారు. కాగా రెవెన్యూ అధికారులకు మాత్రం సర్వే చేసి క్వారీ అప్పగించినప్పుడు మాత్రమే కొంత మొత్తం చెల్లిస్తుంటారు. ఇలా వేలల్లో మామూళ్లు ముట్టజెబుతున్నందున క్వారీల నిర్వహణలో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. గతంలో సేఫ్టీ చెకింగ్‌లు, భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై యాజమాన్యాలు కార్మికులతో సమావేశాలు నిర్వహించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కార్మికులకు బూట్లు, గ్లౌజులు, హెల్మెట్లు కూడా సక్రమంగా ఇవ్వడంలేదని కార్మిక సంఘ నాయకుడు నంబూరు షన్ముఖరావు ఆరోపించారు.

#### తనిఖీల్లో ఏం తేలుతుందో?

జిల్లాలో దాదాపు క్వారీలన్నింటినీ రాజకీయ పార్టీలతో సత్సంబంధాలు ఉన్నవారే నిర్వహిస్తున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల పాటు క్వారీలు తెరుచుకోలేదు. అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా వ్యవహరించిన క్వారీలపై విజిలెన్స్ దాడులు చేయించి రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు అపరాధ రుసుం విధించారు. మరోవైపు అన్ని అనుమతులున్నప్పటికీ పలు రోడ్డు మెటల్ క్వారీల పర్మిట్లు నిలిపేశారు. దాంతో వారంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదే సమయంలో పేలుడుతో ముగ్గురు కార్మికులు మృతి చెందిన తర్వాత తర్వాత కలెక్టర్ ఆదేశాలతో అధికారులు తనిఖీల హడావుడి ప్రారంభించడంతో జిల్లావ్యాప్తంగా క్వారీలు మూతపడ్డాయి. తనిఖీల కోసం అధికారులు క్వారీలకు వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన అనుమతి పత్రాలతో రెవెన్యూ కార్యాలయాలకు రావాలని లీజుదారులను ఆదేశించారు. దాంతో వారంతా తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు పట్టుకొని క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నారు. అయితే చాలామందికి పూర్తిస్థాయి అనుమతులు లేనందున అధికారులు ఏ రీతిలో క్లియరెన్స్ ఇస్తారన్న ఆసక్తి నెలకొంది.

## ఆకట్టుకున్న మహాశిబిరం

(మొదటిపేజీ తరువాయి)

సారధ్యంలో అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. వెయ్యిమంది హాజరయ్యేలా శిబిరాన్ని పది భాగాలుగా విభజించారు. ప్రతి బ్లాక్‌కు ఎదురుగా ఒక యోగా నిపుణుడు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రధాన వేదికపై నైపుణ్యం కలిగిన యోగా గురువు ఆధ్వర్యంలో ప్రత్యేక డెమో సెషన్ నిర్వహించారు. మొత్తం 38 నుంచి 45 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లు శిబిరాన్ని విజయవంతంగా నడిపించారు.

#### ఫ్లెక్సీలు, బ్యానర్లతో అలంకరణ

డచ్ బిల్డింగ్‌కి చారిత్రక ప్రాముఖ్యత ఉన్న నేపథ్యంలో ప్రాంగణాన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లతో అలంకరించారు. తాగునీరు, అల్పాహారం, శానిటేషన్ వంటి సదుపాయాలు మున్సిపాలిటీ సమకూర్చింది. మున్సిపల్, ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖలతో పాటు ప్రభుత్వ విభాగాల నుంచి వందలాది మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం పిలుపు మేరకు పెద్ద ఎత్తున ప్రజలు కూడా కార్యక్రమానికి తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్




జగదీష్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, డిఎంహెచ్‌వో అనిత, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్‌డీవో శ్రీధర్, పతంజలి యోగ ప్రతినిధి డి.చిన్నబాబు, మున్సిపల్ కమిషనర్ బీవీడీ ప్రసాదరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నటుకుల మోహన్, పి.రవికుమార్, డాక్టర్ రవికుమార్, నూక సన్యాసిరావు, కొంక్యాన మురళీధర్, యోగా గురువులు పి.మురళి, తంగి స్వాతి, కల్పన, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి సందీప్, ఏ.గాయత్రి, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.